సాక్షి ఒడిశా

సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 4.80.053
బంగారం : 10.200 గ్రాములు
వెండి : 51 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



మోటార్ వాహన చట్టంపై అవగాహన

మోటార్ వాహన చట్టం, నిబంధనలపై కొరాపుట్ జిల్లా కోర్టు న్యాయ సేవా ప్రదీకరణ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు.

- 8లో



పోలీసుల దాడులు

నిషేధిత ప్లాస్టిక్ విక్రయ కేంద్రాలపై మున్సిపల్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. వేలాది రూపాయలు విలువ చేసే నిషేధిత ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

పారిశుద్ధ్య పరిరక్షణపై అవగాహన



స్వచ్ఛ అవగాహన కార్యక్రమంలో భువనేశ్వర్ కళాకారులు

జయపురం: ప్రజారోగ్యం, పారిశుద్ధ్యంపై జనాలను చైతన్య పరిచే కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 పేరుతో నిర్వహించిన కార్యక్రమాన్ని జయపురంలోని 2, 3 వార్డుల్లో నిర్వహించారు. పురపాలక సిబ్బందితో పాటు భువనేశ్వర్ నుంచి వచ్చిన కళాకారుల టీమ్ తమ నృత్య విన్యాసాలతో పారిశుద్ధ్య పరిరక్షణ గురించి వివరించారు. నివసించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 2వ వార్డులో గదబ సాహిబ సూచించారు. తడి, పొడి చెత్తను వేరుగా ఉంచాలని, వ్యర్థాలను సేకరించేందుకు పారిశుద్ధ్య కార్మికులే ఇంటికి వస్తారని అన్నారు. పాలిథీన్, ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలన్నారు. డెంగీ, మలేరియా బారిన పడకుండా ఉండేందుకు దోమ తెరలు వాడాలన్నారు.

బ్రాహ్మణ సమాజం పేర్లు సేకరించాలి



సమావేశంలో బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి పెద్ద రాధాకాంత మఠంలో బ్రాహ్మణ సమాజం, పూజారుల ఐక్యతపై ఆదివారం సమావేశం జరిగింది. పట్టణంలో ఉన్న 30 మంది బ్రాహ్మణ దేవాధిపతుల సమస్యలపై సమావేశంలో చర్చించారు. ప్రతి వీధిలో ఉన్న బ్రాహ్మణ సమాజం పేర్లు, వారి వివరాలు సేకరించాలని సమాజం ప్రతినిధి బసంత కుమార్ పండా కోరారు. ప్రతినెల మొదటి ఆదివారం నిర్వహించే సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు. సమావేశంలో అమూల్యా పాణిగ్రాహి, రాజేంద్ర రథ్, అభిమన్యుపండా, మనోజ్ దాస్, బునా త్రిపాఠి పురోహిత్, హరినాథ పాత్రో, నృసింహ చరణ్ మిశ్రా, ప్రకాష్ చౌదురి, భాగవత్ పాఢి పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల కమిటీలో కొరాపుట్ ఎంపీకి స్థానం



ఎన్నికల కమిటీకి ఎంపికైన సభ్యులతో సప్తగిరి ఉల్కా

కొరాపుట్: మధ్యప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. దీనికి కోసం ఏఐసీసీ అత్యంత నమ్మకం ఉన్న నలుగురితో స్క్రీనింగ్ కమిటీని ఎంపిక చేసింది. ఇందులో కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కకి స్థానం లభించింది. ఈ కమిటీలో జితేంద్ర ప్రసాద్‌సింగ్, రణదీప్ సుర్జేవాల, అజయ్ వాలా, సప్తగిరి ఉల్కలు ఉన్నారు. ఆదివారం మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్‌లో జరిగిన కీలక సమావేశంలో ఏఐసీసీ ప్రతినిధులు కమిటీ నియామకంపై కీలక ప్రకటనలో చేయగా..అందులో కొరాపుట్ ఎంపీకి స్థానం దక్కడంపై స్థానిక నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా సప్తగిరి ఉల్క ఒక్కరే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా గత ఎన్నికల్లో ఈ ప్రాంతం నుంచి విజయం సాధించారు. రాహుల్ గాంధీతో సప్తగిరి ఉల్కకు మంచి సంబంధాలు ఉన్నాయి.

ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్



విదేశీ మద్యంతో పట్టుబడిన వ్యక్తి

రాయగడ: జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 24 గంటల వ్యవధిలో 98(ఎంవీ) కేసులను నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అపరాధ రుసుం కింద రూ.1.30 లక్షలను వసూలు చేశారు. ఇందులో 5 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఉన్నట్లు పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విదేశీ మద్యంతో వ్యక్తి అరెస్ట్..

తనిఖీల్లో భాగంగా 20 లీటర్ల విదేశీ మద్యం పోలీసులకు పట్టుబడింది. విదేశీ మద్యాన్ని అక్రమంగా కలిగిఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.





గంజాం జిల్లాలో ఉభాలు జోరుగా జరుగుతున్నాయి. చికిటి, దిగపండి, రొంగాయిలోండా, పాత్రపురం పలు బ్లాక్‌ల పరిధిలో ముమ్మరంగా పొలం పనులు జరుగుతున్నాయి. - బరంపురం

● ఆశల చిగురు

‘అమొ ఒడిశా’.. ఏమైందో తెలుసా..?

- సీఎం నవీన్ అమొ ఒడిశా పథకం వివాదాస్పదం
- పథకంపై అభ్యంతరం వ్యక్తం చేసిన 9 మంది సర్పంచ్‌లు
- వివరణ కోరిన హైకోర్టు

భువనేశ్వర్: అమొ ఒడిశా ప్రారంభానికి ముందే వివాదాస్పదమవుతోంది. ఈ పథకం అమలైతే తమ ఉనికి ప్రశ్నార్థకమవుతుందని బొస్తా మండలానికి చెందిన 9 మంది సర్పంచ్‌లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏకంగా హైకోర్టుకు వెళ్లి కేసు దాఖలు చేశారు. దీంతో పథకం పూర్వాపరాలు పరిశీలించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం బొస్తా మండల అభివృద్ధి అధికారిని ఆదేశించింది. పూర్తి వివరణతో మూడు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించడం విశేషం. ఈ కేసు విచారణని జస్టిస్ విశ్వనాథ్ రథ్‌తో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించి వివరణ కోరుతూ తాఖీదులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 27వ తేదీకి వాయిదా వేశారు.

మంత్రి మండలి తీర్మానం మేరకు ఈ ఏడాది జులై 11న అమొ ఒడిశా నవీన్ ఒడిశా పథకం అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ పథకంలో భాగంగా పంచాయతీలో సామాజిక, సాంస్కృతిక అభివృద్ధి కార్యకలాపాలు చేపడతారు. గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధుల ప్రత్యక్ష పర్యవేక్షణలో పంచాయతీల్లో ప్రాథమిక విద్య, మౌలిక సదుపాయాలు, క్రీడల అభివృద్ధి, స్వయం సహాయక బృందాలకు అదనపు సౌకర్యాలు, మహిళా, యువజన సాధికారత వగైరా కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన అమొ ఒడిశా నవీన్ ఒడిశా పథకం కార్యాచరణపై పంచాయతీ ప్రతినిధుల ప్రమేయం, పర్యవేక్షణ అంశాల్ని అంధకారంలోకి నెట్టేసిందని పిటీషనర్లు ఆరోపించారు. నాగేంద్ర కుమార్ సింగ్‌తో మరో 8 మంది పంచాయితీ ప్రతినిధులు హైకోర్టుని ఆశ్రయించారు. ఈ పథకం కింద ప్రతిపాదిత కార్యకలాపాల్ని ఏవిధంగా అమలు చేస్తారనే విషయంపై సర్పంచ్‌లను మభ్యపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం అమలు, కార్యాచరణ కార్యకలాపాలు ప్రభుత్వ అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారని ప్రకటించడం విచారకరమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కార్యకలాపాల్లో పంచాయతీ ప్రజా ప్రతినిధులకు ప్రమేయం లేకుండా చేయడం చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు. పల్లె సభ, గ్రామ సభ ప్రమేయం లేకుండా పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టడం చట్ట పరంగా ఆమోదయోగ్యం కాదన్నారు. గ్రామ పంచాయతీ చట్టం నియమ నిబంధనల మేరకు ఈ పథకం అమలు, కార్యాచరణకు ఆదేశాలు జారీ చేయాలని తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు

- వంద కిలోల గంజాయి స్వాధీనం
- నలుగురు అరెస్టు



అరెస్టయిన నిందితులు



స్వాధీనం చేసుకున్న గంజాయి

బరంపురం: గంజాయి అక్రమ రవాణా గట్టును పోలీసులు రట్టు చేశారు. నలుగురిని అరెస్టు చేసి వారివద్ద నుంచి వంద కిలోల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నారు. బరంపురం నగరం మీదుగా దేశ రాజధాని ఢిల్లీకి గంజాయిని తరలించాలని నిందితులు భావించినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీనికి సంబంధించి బరంపురం ఎక్సైజ్ శాఖ కమిషనర్ రామచంద్ర మహంతి అందించిన సమాచారం ఇలా ఉంది. గజపతి జిల్లా మోహనా అటవీ ప్రాంతం నుంచి దరింగబడి మీదుగా బరంపురం నగరానికి కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్టు పోలీసులకు శనివారం సమాచారం చేరింది. దీంతో అప్రమత్తమైన ఎక్సైజ్ అండ్ అబ్కారి విభాగం అధికారులు వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఓ కారులో వంద కిలోల గంజాయితో ఉన్న బస్తా బయటపడింది. దీంతో కారు డ్రైవర్‌తోపాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ శాఖ కమిషనర్ రామచంద్ర మహంతి తెలిపారు.

జిల్లా న్యాయ సలహా సహాయ సంస్థ ఆధ్వర్యంలో పోటీలు



విజేతలకు బహుమతి ప్రదానోత్సవం

రాయగడ: జిల్లా న్యాయ సలహా సహాయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన వక్తృత్వ, నాటక, చిత్రలేఖన పోటీలకు అనూహ్య స్పందన లభించింది. సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ సాడంగి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 11 పాఠశాలలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సరస్వతి శిశుమందిర్, సేక్రెడ్ హార్ట్ స్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. బహుమతి ప్రదానోత్సవంలో సాడంగి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసలహా సహాయ సంస్థ కార్యదర్శి నివేదిత పండా, ఫ్యామిలీ కోర్టు జడ్జి అమత రంజన్ నొంది తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ ప్రారంభం



సైక్లింగ్‌పై ప్రచారం చేస్తున్న మోహనరావు

జయపురం: సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు గ్రామీణులకు వివరించేందుకు జయపురం స్వచ్ఛంద సంస్థ సోషియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ అసోసియేషన్(సీవా) ప్రచార కార్యక్రమం నిర్వహిస్తోంది. కొన్ని కారణాల వల్ల 8 నెలలుగా ఈ కార్యక్రమం ఆగిపోయింది. ఆదివారం మళ్లీ ప్రారంభించినట్లు సీవా సీనియర్ సభ్యులు కిల్లంసెట్టి మోహనరావు తెలిపారు.

● భారీ వర్షం.. కూలిన చెట్లు



కూలిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

- వాహనాల రాకపోకలకు అంతరాయం
- యుద్ధప్రాతిపదికన తొలగించిన అధికారులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి సుంకి సమీపంలో ఆదివారం భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు సుంకి ఘాట్లలో చెట్లు కూలిపోవడంతో విశాఖపట్నం–రాయ్‌పూర్ రహదారిలో వాహనాల రాకపోలు నిలిచిపోయాయి. అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన కూలిన చెట్లను తొలగించారు. చెట్లు రోడ్డుకు అడ్డంగా కూలిపోవడంతో సుమారు మూడు గంటలు ట్రాఫిక్ స్తంభించింది.

సూర్యనారాయణ పాత్రోకి ఘన నివాళి

అసెంబ్లీ మాజీ స్పీకర్, మాజీ మంత్రి, గంజాం జిల్లా దిగపహాండి ఎమ్మెల్యే సూర్యనారాయణ పాత్రో మృతిపై వివిధ వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. సూర్యనారాయణ పాత్రో భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. ఆయన మృతిపట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో చాణుక్యుడిగా ముద్రపడిన పాత్రో మృతి రాష్ట్రానికి తీరని లోటని ఆయన సేవల్ని పలువురు కొనియాడారు. వివిధ ప్రాంతాల్లో సంతాప సభలు ఏర్పాటు చేసి ఘన నివాళులర్పించారు.

-బరంపురం/కొరాపుట్/జయపురం/రాయగడ



నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్. చిత్రంలో పాండ్యన్ తదితరులు..

సూర్యనారాయణుడు..
అపరచాణక్యుడు..

మాజీ స్పీకర్ సూర్యనారాయణ పాత్రో అపరచాణక్యుడు అనేందుకు ఈ ఘటనే చిన్న ఉదాహరణ. పాత్రోకి నవరంగ్‌పూర్ జిల్లాతో అనుబంధం ఉంది. 2013లో ఉమ్మర్ కోట్ ఎమ్మెల్యే జగబంధు మఝిని మావోయిస్టులు కాల్చిచంపారు. ఆ సంఘటన జరిగిన వెంటనే పాత్రో అక్కడికి చేరుకున్నారు. అంత్యక్రియల అనంతరం పార్టీ ఉప ఎన్నికల వరకు అక్కడే మకాం వేశారు. ఉప ఎన్నికల్లో అభ్యర్థిగా జగబంధు కారు డ్రైవర్ సుభాష్ గోండోను పార్టీ అభ్యర్థిగా ప్రకటించి సంచలనం సృష్టించారు. అందరి అంచనాలను తలకిందులు చేసి గోండోను గెలిపించేంత వరకు శ్రమించి చరిత్రలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. -కొరాపుట్



బిజయ్ మహాపాత్రో, ప్రణవ్ ప్రకాష్ దాస్

భౌతికకాయాన్ని సందర్శించిన సీఎం నవీన్

రాయగడ: మాజీ స్పీకర్ సూర్యనారాయణ పాత్రో భౌతిక కాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్, రాష్ట్ర మంత్రి ప్రమీలా మల్లిక్, బీజేపీ అగ్రనాయకులు బైజంత్ పండా, బిజయ్ మహాపాత్రో, బీజేడీ రాష్ట్ర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రణవ్ ప్రకాష్ దాస్‌లు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



పోలీసు వందనం



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



బీజేపీ నాయకుడు బైజయంత్ పండా నివాళి



జయపురం కార్మిక భవనంలో జరిగిన కార్యక్రమంలో..



నివాళులర్పిస్తున్న మంత్రి ప్రమీలా మల్లిక్



బరంపురంలో నిర్వహించిన సంతాప సభలో ఎంపీ చంద్రశేఖర్, నగర మేయర్ సంఘమిత్ర దోళాయి తదితరులు



బరంపురంలో సంతాపం వ్యక్తం చేస్తున్న మాజీ మేయర్ శిబశంకర్ దాస్



భువనేశ్వర్‌లో ప్రణవ్ ప్రకాష్ దాస్, ప్రకాష్ మహంతిలతో కలిసి నివాళులర్పించడానికి వెళ్తున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని

క్లుప్తంగా

200 కిలోమీటర్లు ప్రయాణించి..



విశాఖలో టికేశ్వరరావుకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ పావని

పాతపట్నం: అనారోగ్యం కారణంగా విశాఖలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి పింఛన్ అందించేందుకు ఓ వలంటీర్ 200 కిలోమీటర్లు ప్రయాణించారు. సింగుపురం గ్రామానికి చెందిన టికేశ్వరరావు విశాఖలోని టాటా మెమోరియల్ ఆస్పత్రిలో గత కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. ఆయనకు వృద్ధాప్య పింఛన్ అందించేందుకు వలంటీర్ పావని విశాఖ వెళ్లారు. అంతదూరం ప్రయాణించి లబ్ధిదారుడికి డబ్బు అందజేసినందుకు వలంటీర్‌ను అంతా అభినందించారు.

భక్తుల వసతి గది నిర్మాణానికి రూ.2.50 లక్షలు వితరణ



విరాళ చెక్కును ఈఓకు అందజేస్తున్న వరం కుటుంబసభ్యులు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల కోసం వసతి గది నిర్మాణానికి దివంగత అంధవరపు వరాహనర్సింహం జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు రూ.2.50 లక్షల చెక్కును ఆదివారం ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. ఈ మేరకు వరం కుమార్తె వైఎస్సార్‌సీపీ నేతలు పైడిశెట్టి జయంతి బెనర్జీ, కుమారులు అంధవరపు ప్రసాద్, స్నేహ, సంతోష్, సింధు దంపతులు కలిసి ఈ విరాళాన్ని అందజేశారు. అంతకుముందు ఆదిత్యుడిని కుటుంబ సభ్యులంతా కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వారికి ఆదిత్యుని తీర్థ ప్రసాదాలు, వేదాశీర్వచనాలను అందజేశారు. ఈ సందర్భంగా అంధవరపు ప్రసాద్ మాట్లాడుతూ తన తండ్రికి ఆదిత్యుని ఆలయమంటే ఎంతో ఇష్టమని, ఆయన పేరిట ట్రస్ట్ పేరిట పలు సేవా కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నామని, ఇందులో భాగంగానే వసతి గది నిర్మాణానికి సంకల్పించామని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ అంధవరపు సూరిబాబు, ఆలయ పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, డాక్టర్ కె.సోమేశ్వరరావు, లుకలాపు గోవిందరావు, దుక్క గనిరాజు, జలగడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

శ్రావణ ఆదివారం సందర్భంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. పూజలు, విరాళాల పేరిట రూ.66,076, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 1.75 లక్షలు, దర్శన టిక్కెట్లు విక్రయాల ద్వారా రూ.1,81,200 వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.

ఉపాధ్యాయులకు పురస్కారాలు

శ్రీకాకుళం : శ్రీ శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో 193 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ చిందు శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిందు శ్రీకాంత్ మాట్లాడుతూ గురువుల ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని చాటి చెప్పడం ప్రతి ఒక్కరి విధి అని, అందుకే ఈ అవార్డులు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ బి.వి.రమణమూర్తి, విశాఖపట్నం గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.సుందరయ్య చేతుల మీదుగా ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించి అవార్డులు అందించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, ఎస్‌ఐ ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి ఆమదాలవలస–దూసి రైల్వేస్టేషన్‌ల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్‌ఎల్‌ఎన్ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మృతుడి వయసు దాదాపు 50 ఏళ్లు ఉంటుందని, ఛామన ఛాయలో రంగులో ఉంటాడని తెలిపారు. నీలం రంగు షర్టు, తెలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించామన్నారు. మృతుని వివరాలు తెలిస్తే శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

● శ్రమదానం బాట..



నిరంతరం బిజీగా ఉండే అధికారులు ఆదివారం శ్రమదానానికి సిద్ధమయ్యారు. కలెక్టరేట్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ రామేశ్వర్ ప్రధాన్, ఏడీఎం భాస్కర రైతా, డిప్యూటీ కలెక్టర్ నారాయణ మిశ్రోల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఉద్యోగులు ఈ శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పేరుకుపోయిన చెత్తా చెదారంతో పాటు పిచ్చిమొక్కల్ని తొలగించారు. అధికారుల సేవానిరతికి ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. - రాయగడ

● సంప్రదాయ కళకు బాసట..



ఇటీవల నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి దోహనా గ్రామం బైరాగి గూడని ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్ సందర్శించారు. వాయిద్య పరికరాలు లేకపోవడంతో తాము సంప్రదాయ కళకు దూరమవుతున్నామని వాటిని సమకూర్చేలా సహకరించాలని స్థానిక గిరిజనులు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం పరికరాలను ఆ ఊరికి పంపించారు. పూజలు అనంతరం గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. - కొరాపుట్

ఆగని గొలుసు దొంగల ఆగడాలు

- రోజురోజుకీ పెరుగుతున్న గొలుసు దొంగతనాలు
- తాజాగా బొరిగుమ్మ సమితిలో మరో ఘటన



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు సుమిత్ర

జయపురం: చైన్‌స్నాచర్లు రెచ్చిపోతున్నారు. విచక్షణా రహితంగా వ్యవహరిస్తున్నారు. మోటార్‌బైక్‌లపై వచ్చి మహిళల మెడలలో నుంచి గొలుసులను తెంపుకుని వెళ్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం జయపురం, కొరాపుట్, నవరంగ్‌పూర్‌లలో గొలుసు దొంగలను అరెస్ట్ చేసినా.. తాజాగా ఆదివారం బొరిగుమ్మ సమితిలో ఓ మహిళ మెడలో బంగారు గొలుసును ఎత్తుకెళ్లి చైన్ స్నాచర్లు పోలీసులకు సవాల్ విసిరారు. తాజా ఘటనకు సంబంధించి బాధితులందించిన వివరాల మేరకు..జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి దులాగుడ రోడ్డు సమీపంలో సుమిత్ర అనే మహిళ కిరాణాదుకాణం నడుపుతోంది. ఆదివారం ఉదయం ఆమె దుకాణంలో కూర్చుని ఉండగా బైక్‌పై వచ్చిన దుండగులు కూల్‌డ్రింక్, మిక్చర్ కావాలని అడిగారు. ఇచ్చే క్రమంలో మెడలో బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై పరారయ్యారు. రెండు తులాల బరువైన బంగారు గొలుసు తెంపుకుని పారిపోయినట్లు బాధితురాలు బొరిగుమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొలుసు దొంగలు రెచ్చిపోతున్న నేపథ్యంలో పెట్రోలింగ్‌ను పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

మోటార్ వాహన చట్టంపై అవగాహన

జయపురం: మోటార్ వాహన చట్టం, నిబంధనలపై కొరాపుట్ జిల్లా కోర్టు న్యాయ సేవా ప్రదీకరణ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్ర అధ్యక్షతన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన పర్యవేక్షించారు. అదనపు జిల్లా జడ్జి, స్వతంత్ర పోస్కో జడ్జి సి.హెచ్.బాసుదేవ్ పాత్రో, పలు న్యాయ స్థానాల న్యాయాధికారులు, కొరాపుట్ ఎస్పీ అభినవ సోనేకార్, అదనపు ఎస్పీ బోలభోద్ర దీప్, పలువురు పోలీస్ అధికారులు, కొరాపుట్ రీజనల్ ట్రాన్స్‌పోర్టు అధికారులు, కొరాపుట్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్, జయపురం బీమా అధికారులు, పలువురు న్యాయవాదులు, జిల్లా కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. 2022లో సుప్రీంకోర్టు ఓ సివిల్ అపీల్‌పై ఇచ్చిన తీర్పు ఆదేశాలను అమలు చేసేందుకు, మోటార్ వాహన చట్టాలపై అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్ విక్రయ కేంద్రాలపై పోలీసుల దాడులు

- పలువురు వ్యాపారులకు జరిమానా విధింపు



తొమ్మిదో వార్డులో స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ సంచులు

పర్లాకిమిడి: పర్లాకిమిడి పట్టణంలో ప్లాస్టిక్ సంచులను అధికారులు నిషేధించారు. అయినా కొంత మంది అక్రమంగా వీటిని విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న మున్సిపల్ అధికారులు పలు గొడౌన్లు, టోకు వ్యాపారులపై దాడులను ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా తొమ్మిదో వార్డు రంగిరీజు వీధి, భక్షీ వీధిల్లోని వ్యాపారుల ఇళ్లలో పోలీసులతో కలిసి ఆదివారం దాడులు చేశారు. ఈ సందర్భంగా వేలాది రూపాయల విలువచేసే నిషేధిత ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బోక్సి వీధిలో తంగుడు మోహన్‌రావు ఇంట్లో సుమారు రెండు ట్రాక్టర్ల ప్లాస్టిక్ సంచుల సరుకును పట్టుకున్నామని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ అధికారి బనమాళి శథపతి తెలిపారు. ఇద్దరికి రూ. 40 వేల చొప్పున జరిమానా విధించామన్నారు.

కుటుంబంతో కలిసి వెళ్తుండగా..

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం నగిరిపెంట గ్రామ సమీపంలో రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఒడిశా రాష్ట్రానికి చెందిన వాడు. ఈ మేరకు స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన స్వరూప్ మాలిక్(28) అనే వ్యక్తి తన భార్య, కుమారుడితో కలసి చేపల చెరువుల పని మీద విజయవాడ వెళ్లేందుకు ఆదివారం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణమయ్యారు. డోర్ వద్ద కూర్చుని ఉండగా సంతబొమ్మాళి మండలం నగిరిపెంట గ్రామ సమీపంలోకి వచ్చేసరికి ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందకు పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడున్న వారు వెంటనే ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు రైల్వే పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

విక్రమదేవ్ వర్సిటీలో..

యూసీసీపై అవగాహన



యూసీసీపై ప్రసంగిస్తున్న స్వర్ణ చరిత సెఠి



చర్చా వేదికలో పాల్గొన్న పొలిటికల్ సైన్స్ విద్యార్థులు


జయపురం: జయపురంలోని విక్రమదేవ్ వర్సిటీలో గల రాజకీయ విజ్ఞాన విభాగం ఆధ్వర్యంలో ఇంప్లిమెంటేషన్ ఆఫ్ యూనిఫాం సివిల్ కోడ్ ఇన్ ఇండియా' (యూసీసీ) అన్న అంశంపై ఆదివారం చర్చా వేదిక నిర్వహించారు. విశ్వవిద్యాలయ రాజకీయ విజ్ఞాన విభాగం చీఫ్ మహేశ్వర దురియ పర్యవేక్షణలో పొలిటికల్ సైన్స్ రెండో సంవత్సరం విద్యార్థిని స్వర్ణ సరిత సెఠి యూసీసీపై ప్రసంగించింది. విద్యార్థిని ప్రసంగం తరువాత ప్రశ్నోత్తర కార్యక్రమాన్ని అధ్యాపకులు సంజు కౌశల్య నిర్వహించారు. అధ్యాపకులు ప్రదీప్ శబర, కార్యదర్శి శుభదర్శిణి పండా, కల్పన బారిక్ తదితరులు భారత్‌లో రాజకీయ విజ్ఞానం–నేటి పరిస్థితులపై ప్రసంగించారు. పొలిటికల్ సైన్స్ విద్యార్థులు చర్చా వేదికలో పాల్గొని తమ అభిప్రాయాలను వివరించారు. ద్వితీయ సంవత్సర విద్యార్థి సంతోష్ కుమార్ పాత్రో కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

స్కూల్‌గేమ్స్‌కు సర్వం సిద్ధం

- పాఠశాలల క్రీడా పోరుకు సిద్ధం
- మొత్తం ఐదు స్థాయిల్లో జరగనున్న పాఠశాలల క్రీడా పోటీలు
- నేటి నుంచి మండల స్థాయి అండర్– 14,17 ఎంపిక పోటీలతో మొదలు
- 9వ తేదీ వరకు స్కూల్‌గేమ్స్ మండలస్థాయి పోటీలు



కూతకు సిద్ధమవుతూ.. కబడ్డీ శిక్షణలో క్రీడాకారులు



వాలీబాల్ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల క్రీడల (స్కూల్ గేమ్స్)కు రంగం సిద్ధమైంది. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాల క్రీడల సమాఖ్య (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జరగనున్న స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. చాలాకాలం తర్వాత గత ఏడాదే ఈ పోటీలను పునరుద్ధరించారు. ఈ ఏడాది మాత్రం విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, పీఈటీ సంఘ నాయకులు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రాతిపదికగా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

స్కూల్‌గేమ్స్ పోటీలకు అర్హులు ఎవరంటే?

- స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు అండర్–14, 17, 19 వయో విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా జరుగుతాయి. పాఠశాల విద్య పరిధిలో అండర్ 14, 17 విభాగాల్లో, ఇంటర్మీడియెట్ విద్య పరిధిలో అండర్–19 ఎంపికలు జరుగుతాయి.
- అండర్–14 బాలబాలికలు 2010 జనవరి ఒకటి, అండర్–17కు 2007 జనవరి ఒకటి, అండర్–19కు 2005 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలి.
- అండర్–14కు 8వ తరగతిలోపు చదువుతూ ఉండాలి. అండర్–17కు ఇంటర్ ఫస్టియర్‌లోపు చదువుతూ ఉండాలి. అండర్–19కు డిగ్రీ ఫస్టియర్‌లోపు చదువుతూ ఉండాలి.
- స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొనే బాలబాలికలు 'స్కూల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ (ఎస్‌ఈఎం)' యాప్ నందు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. పారదర్శకత కోసం ఈ ఏడాది మొదటిసారిగా ఈ ప్రయోగాన్ని తీసుకువచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు అన్ని యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు వారి యూ–డైస్ కోడ్‌తో వారి పాఠశాల యొక్క పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అవ్వాలి. అందులో ఎస్‌జీఎఫ్ పోర్టల్‌లో క్రీడాకారులు తమ వివరాలను ఎంటర్ చేసి సబ్మిట్ చేయాలి.

నేటి నుంచి మండల పోరు

స్కూల్‌గేమ్స్ అండర్–14, 17 పోరులో భాగంగా నేటి నుంచి మండలస్థాయి పోరు ఆరంభంకానుంది. ఈనెల 9వ తేదీ వరకు ఆయా మండలాల్లో నిర్దేశించుకున్న షెడ్యూల్ ప్రకారం రెండు రోజులపాటు ఈ పోటీలను నిర్వహిస్తారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, త్రోబాల్, యోగా ఈ తొమ్మిది క్రీడాంశాల్లో తొలుత మండలస్థాయి పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో ఇప్పటికే పోటీలు జరిగే వేదికను, మండల స్పోర్ట్స్ పరిశీలకులను నియమించారు. అక్కడి హెచ్‌ఎం, మండల ఎంఈఓలు ఈ పోటీలను పర్యవేక్షించడంతో పాటు అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించనున్నారు.

నియోజక వర్గ, జిల్లాస్థాయి పోటీలు ఇలా..

నియోజకవర్గస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు జరగనున్నాయి. మండల స్థాయిలో జరుగుతున్న 9 క్రీడాంశాల్లో ఎంపికైన క్రీడాకారులంతా నియోజకవర్గ స్థాయిలో పోటీపడతారు. శ్రీకాకుళం అర్బన్‌తో కలిసి 39 మండలాల పరిధిలో ఎంపికైన బాలబాలికలు వారివారి నియోజకవర్గంలో ఎంపికచేసిన కేంద్రాల్లో జరిగే పోరులో పోటీపడతారు. అక్కడ ఎంపిక చేసిన జట్లు/క్రీడాకారులు జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో నేరుగా అర్హత సాధిస్తారు. వీరితోపాటు మిగిలిన మరో 23 క్రీడాంశాలతో కలిపి జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో తలపడతారు. ఈ పోటీలు ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాలతోపాటు సమీపంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా పోటీలు నిర్వహించనున్నారు.

32 క్రీడాంశాలతో జిల్లాస్థాయి పోటీలు

జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు మొత్తం 32 క్రీడాంశాల్లో జరగనున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, జూడో, సెపక్‌తక్ర, హాకీ, తైక్వాండో, టెన్నీస్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్, చెస్, బాల్‌బ్యాడ్మింటన్, క్రికెట్, ఫుట్‌బాల్, త్రోబాల్, నెట్‌బాల్, రోప్‌స్కిప్పింగ్, రగ్బీ, వెయిట్‌లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, టెన్నీకాయిట్, యోగా, ఆర్చరీ, బాక్సింగ్, స్విమ్మింగ్, రోలర్‌స్కేటింగ్, టేబుల్‌టెన్నీస్ క్రీడాంశాల్లో ఎంపికలు జరుగుతాయి. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లు/క్రీడాకారులు వివిధ జిల్లాల్లో జరిగే.. రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. అక్కడ రాణించినవారు వివిధ రాష్ట్రాల్లో జరిగే.. జాతీయ పోటీలకు ఎంపికై రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



జిల్లాలో స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. డీఈఓ నేతృత్వంలో పీఈటీ సంఘ నాయకులు, ఎంఎస్‌ఓలు, నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ల సమన్వయంతో పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తొలుత జిల్లాలో అత్యంత ఆదరణ కలిగిన 9 క్రీడాంశాల్లో మండలస్థాయి, నియోజకవర్గస్థాయి ఎంపికలు జరుగుతాయి. ఆ తదుపరి జిల్లాస్థాయి ఎంపిక పోటీలను జరుపుతాం. విజయవంతం చేయాలి.

– బీవీ రమణ, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి

పారదర్శకంగా ఎంపిక పోటీలు..



విద్యార్థి జీవితంలో కీలకమైన స్కూల్‌గేమ్స్ పోటీలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. వారు శిక్షణ పొందుతున్న క్రీడలో తమ ప్రతిభను నిరూపించుకోవాలి. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని వసతులు, భోజనాలు కల్పించేలా ఎంఈవోలు, హెచ్‌ఎంలు, పీడీలు పూర్తి చొరవ తీసుకోవాలి.

– కె.వెంకటేశ్వరరావు, డీఈఓ, శ్రీకాకుళం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు

ఆలయ పూజారి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న కాళియా మృతదేహం

మందస: మందస పట్టణ శివారులోని కంచమయమ్మ ఆలయ పూజారి రమ్మోకాళియా(23) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మూడు రోజుల కిందటే జరగ్గా, ఆదివారం వెలుగు చూసింది. మందస పట్టణంలోని కొత్తవీధిలో నివాసముంటున్న కాళియా కుటుంబ సభ్యులు కంచమయమ్మ ఆలయ పూజారులుగా పని చేస్తున్నారు. చిన్నప్పుడే తల్లిదండ్రులు మరణించడంతో వారసత్వంగా అర్చకవృత్తి చేపట్టిన రమ్మో కాళియా కుటుంబ పరిస్థితుల దృష్ట్యా మద్యానికి బానిసయ్యాడు. మూడు రోజుల నుంచి ఇంటికి రాకపోవడంతో.. ఏదో ఒక సమయంలో వస్తాడులే అనుకుని బంధువులు అనుకున్నారు. కానీ ఆదివారం భక్తులు ఆలయానికి వెళ్లి చూడగా అక్కడకు సమీపంలోని మామిడిచెట్టుకు కాళియా ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని, అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో 174 కింద కేసు నమోదు చేసి, కాశీబుగ్గ రూరల్ సీఐ శంకరరావు, మందస ఇన్‌చార్జి మధుసూదనరావు, ఏఎస్‌ఐ కె.శేఖర్‌రావు సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేశారు. కాళియా ఇంటి పరిస్థితులు దృష్ట్యా మద్యానికి బానిసగా మారి, ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు



కారు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన ఆటో



టిప్పర్ లారీ ఢీకొనడంతో గాయపడిన గౌరునాయుడు

లావేరు: మండలంలోని బుడుమూరు గ్రామం, అదపాక జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. లావేరు స్టేషన్ హెచ్‌సీ రామారావు తెలిపిన ప్రకారం.. విజయనగరం జిల్లా వేపాడ మండలం తెట్టంగి గ్రామానికి చెందిన అల్లాడ సాంబశివరావు అతని భార్య సౌమ్య, అత్త, మామ సత్యవతి, సూర్య నారాయణ ఆదివారం ఆటోలో అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి ఆటోలో వెళ్లిపోతుండగా లావేరు మండలంలోని బుడుమూరు గ్రామం వద్ద ఒడిశా నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న కారు ఆటోను వెనుక వైపున బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న అల్లాడ సాంబశివరావు అతని భార్య సౌమ్య, అత్త, మామ సత్యవతిలు గాయాలయ్యాయి. గాయపడిన నలుగురు వ్యక్తులను 108లో ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

టిప్పర్ ఢీకొని..

రణస్థలం మండలంలోని కొండములగాం గ్రామానికి చెందిన పిన్నింటి గౌరునాయుడు అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో వెళుతుండగా లావేరు మండలంలోని అదపాక గ్రామం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ర్యాంగ్ రూట్‌లో వచ్చిన టిప్పర్ లారీ ఢీకొంది. దీంతో గౌరునాయుడికి గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై వెళుతున్న వాహనదారులు స్పందించి గాయపడిన గౌరునాయుడుకు సహాయక చర్యలు అందించారు. గాయపడిన అతడిని చికిత్స కోసం 108 అంబులెన్సులో రిమ్స్‌కు తీసుకువెళ్లారు.

క్లుప్తంగా

కోటదుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఘటాలతో అమ్మవారి దేవస్థానంకు చేరుకున్న భక్తులు

పాలకొండ రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం పాలకొండ కోటదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఇటీవల వివాహాలు చేసుకున్న నూతన వధూవరులు అమ్మవారికి ముర్రాటలు, ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న చెట్టుకు జలాభిషేకం చేశారు. ఘటాల ఊరేగింపులో కళాకారుల సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకలు, ప్రసాదాలను అర్చకులు దార్లపూడి లక్ష్మిప్రసాద శర్మ అమ్మవారికి నివేదించారు.

కూలిన పెంకుటిల్లు



పెదకాదలో కూలిన పెంకిటిల్లు వద్ద వివరాలు సేకరిస్తున్న వీఆర్వో సింహాచలం

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద గ్రామంలో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నిరుపేద పావాడ పైడితల్లి ఇల్లు కూలిపోయినట్లు ఉప సర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు ఆదివారం తెలిపారు. అయితే అదృష్టవశాత్తు ఇంటిలోని వారు అప్రమత్తంగా ఉండడంతో ఎలాంటి ప్రాణ,ఆస్తినష్టం జరగలేదని అన్నారు. ఈ విషయమై తహసీల్దార్ గురుమూర్తికి సమాచారం అందించడంతో వీఆర్వో సింహాచలం గ్రామానికి వచ్చి సర్పంచ్ గుజ్జ మంగను కలిసి వివరాలు సేకరించినట్లు ఉపసర్పంచ్ తెలిపారు.

గోడకు బీటలు



డాబా ఇంటికి బీటలు వారిన గోడ

సీతానగరం: మండలంలోని గాదెలవలసలో శనివారం రాత్రి పిడుగు పడడంతో గ్రామానికి చెందిన బి.తిరుపతిరావు ఇంటి మూడవ అంతస్తులో గోడ బీటలు వారడంతో పాటు కేబుల్, సోలార్ వైర్లు మాడిపోయాయి. ఈ మేరకు బాధితుడు తిరుపతిరావు ఆదివారం ఉదయం తెలియజేశారు. శనివారం రాత్రి ఉరుములు పిడుగులుతో కురిసిన వర్షం కారణంగా ఇంటికి దగ్గరలో పిడుగులు పడ్డాయనుకున్నామని ఉదయం లేచి తమ ఇంటి మూడో అంతస్తులో చూడగా గోడ బీటలు వారిందని చెప్పాడు. అగ్గి పిడుగు పడడంతో తిరుమల కేబుల్ నెట్‌వర్క్‌కు సంబంధిచిన వైర్లు, విద్యుత్ వైర్లు కాలి పోయినట్లు తెలియజేశారు. తిరుపతిరావు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.శ్రీరాములు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ పరామర్శించారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



పాపినాయుడు మృతదేహం

బలిజిపేట: వంగర మండలంలోని కె.చాకరాపల్లి గ్రామానికి చెందిన వై.పాపినాయుడు(45) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పాపారావు ఆదివారం తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు చెప్పారు. ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. పాపినాయుడికి మద్యం తాగే అలవాటు ఉంది. దీనికి తోడు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. వృత్తిరీత్యా డ్రైవర్ అయిన పాపినాయుడు శనివారం సాయంత్రం మూర్ఛ టాబ్లెట్‌లు నారాయణపురం నుంచి తీసుకువస్తానని చెప్పి బయటకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తూ నారాయణపురం- కె.చాకరాపల్లి గ్రామాల మధ్య గడ్డి మందు తాగేశాడు. ఇంటికి వెళ్లి తండ్రి, భార్యతో ఈ విషయం చెప్పగా వారు వెంటనే శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతిచెందాడు.

కుక్కల దాడిలో ఆవు, దూడ మృతి

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో ఆవుతో పాటు దూడ అక్కడికక్కడే మృతిచెందాయి. ఆదివారం జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోట్నూరు బంగారు నాయుడి ఆవుతో పాటు దూడను పశువుల పాకలో కట్టగా ఊరిలోని కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయ పరచడంతో అవి మృత్యువాత పడ్డాయి.

జ్వరాలతో జాగ్రత్త..!



జ్వరాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- జిల్లాలో భారీగా కేసుల నమోదు
- సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో పెరిగే ఆస్కారం
- అదుపు చేసేందుకు ముందస్తు చర్యలు
- ఇంటింటా సర్వేచేస్తున్న వైద్యసిబ్బంది

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో జ్వరాల వ్యాప్తి మొదలైంది. పల్లెలు పట్టణాల్లో జనం జ్వరాల బారిన పడుతున్నారు. చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు రోగులు వస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం వద్ద కొంతమంది వైద్యం చేయించుకుంటుండగా, మరి కొంతమంది పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. మలేరియా, డెంగీ వంటి జ్వరాలు సోకిన వారు సర్వజన ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. జ్వరాల వ్యాప్తి అధికంగా ఉన్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధుల వ్యాప్తికి కట్టడి చర్యలతో పాటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు జ్వర పీడితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.

జిల్లాలో 1,27,655 జ్వరాల నమోదు

జిల్లాలో జ్వరాల వ్యాప్తి మొదలు కావడంతో జనవరి నెల నుంచి ఆగస్టు నెలాఖరు నాటికి 1,27, 655 కేసులు నమోదయ్యాయి. అలాగే మలేరియా 241, డెంగీ 260 కేసులు నమోదయ్యాయి.

వైద్యసిబ్బంది సర్వే

జిల్లాలో వైద్యసిబ్బంది జ్వర పీడితులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. ఆశవర్కర్లు, ఏఎన్ఎం,



రాకోడు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్

వలంటీర్‌లు ఇంటింటికి వెళ్లి ఆరా తీస్తున్నారు. జ్వర పీడితులు ఉంటే వారి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. అదేవిధంగా జ్వర పీడితులకు ఎంఎల్‌హెచ్‌పీలు మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వచ్చే రెండు నెలలు కీలకం సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జిల్లాలో వ్యాధుల వ్యాప్తి మరింత పెరిగే పరిస్థితి ఉంది. జిల్లాలో ప్రస్తుతం వైరల్, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, డయేరియా వ్యాప్తి చెందుతున్నాయి.

అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ

వ్యాధుల పట్ల వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ రాజ్‌శాఖ సమన్వయంతో పారిశుధ్య చర్యలు చేపడుతుంది.

వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తం



వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు, క్లోరినేషన్ చేపడుతున్నాం. జ్వర పీడితులను గుర్తించేందుకు వైద్యసిబ్బంది సర్వే చేస్తున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పీహెచ్‌సీల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

అలాగే తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయిస్తోంది. అదేవిధంగా దోమలు వృద్ధి చెందకుండా కాలువల్లో స్ప్రేయింగ్ చేయిస్తున్నారు. జ్వరాల వ్యాప్తి అధికంగా ఉన్న గ్రామాల్లో ఫాగింగ్ చేయిస్తూ..ఇంటి పరిసరాలు, ఇంటిలో ఉండే ఫ్రిజ్‌లు ఏసీలు ,కూలర్లలో నీరు లేకుండా చూసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. జ్వరాలు, డయేరియా ప్రబలిన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు

- యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కులకు భంగం కలిగించే అక్రమ బదిలీలను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశ మందిరంలో జిల్లా కమిటీ నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించించారు. ఈ సందర్భంగా బదిలీల కౌన్సెలింగ్ సమయంలో ఉపాధ్యాయులకు అదనంగా ఉన్న ఖాళీలను చూపించమంటే ఖాళీలు లేవని తప్పుడు సమాచారం ఇచ్చి ఆయా స్థానాలలో అక్రమ బదిలీలతో నింపడాన్ని సమావేశంలో ఖండించారు. జిల్లా అధ్యక్షుడ జేఆర్ఎల్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.సత్యశ్రీనివాస్, జిల్లా సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, జి.పార్వతి, కోశాధికారి సీహెచ్.భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సీహెచ్.తిరుపతినాయుడు, ఎన్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో రేణుశ్రీ సత్తా



బ్యాడ్మింటన్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన రేణుశ్రీ

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరుగుతున్న అండర్-15 బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన యవర్ణ రేణుశ్రీ సత్తా చాటింది. విశాఖ వేదికగా రెండు రోజులుగా జరుగుతున్న పోటీల్లో సింగిల్స్ విభాగంలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారిణి సిల్వర్‌మెడల్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా రేణుశ్రీని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ కోలగట్ల వీరభద్రస్వామి, అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్‌లు అభినందించారు.

బైక్ చోరీ

జామి: మండలకేంద్రం జామి చెంబురివారి వీధిలో గ్రామానికి చెందిన పి.వి.భాస్కర్ పలన్స్‌ర్-180 బైక్‌ను ఇంటిముందు పార్క్ చేయగా రెండు రోజుల క్రితం చోరీకి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను అపహరించగా బాధితుడు భాస్కరరావు గాలించిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎనీమియా బాధితురాలికి రూ.10 వేలు పింఛన్

వీరఘట్టం: స్థానిక బీసీ కాలనీకి చెందిన టొంపల పుష్పలత ఎనీమియాతో బాధపడుతుండడంతో ప్రభుత్వం రూ.10 వేలు పింఛన్ మంజూరు చేసింది. ఆమె పరిస్థితిని వైద్యులు ప్రభుత్వానికి గత నెలలో నివేదించారు. దీనికి స్పందించిన ప్రభుత్వం పుష్పలతకు వెంటనే రూ.10 వేలు పింఛన్ మంజూరు చేసింది. ఈ పింఛన్‌ను వలంటీరు జీవన్‌తో కలిసి మాజీ ఎంపీటీసీ బొమ్మాళి హేమలత బాధితురాలికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొద్దూరు రామ్మూర్తి, కడగల రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు వలంటీర్ దిలీప్ ఆస్పత్రికి వెళ్లి దివ్యాంగుల పింఛన్ రూ.3 వేలు అందజేశాడు.



ఎనీమియాతో బాధపడుతున్న యువతికి రూ.10 వేలు పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో బయోమెట్రిక్

- వైద్యసిబ్బంది హాజరు తప్పనిసరి
- అటెండెన్స్‌తో వేతనానికి అనుసంధానం
- ఈ నెల నుంచి కచ్చితంగా అమలు

పాలకొండ రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి..ప్రజలకు మరింత మెరుగ్గా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆస్పత్రితో పాటు ఇతర ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది వందశాతం విధులకు హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం అన్ని ఆస్పత్రుల్లో అటెండెన్స్ రిజిస్టర్, ఆధార్ ఎనేబుల్ బయో మెట్రిక్ అటెండెన్స్ సిస్టం (ఏఈబీఏఎస్), ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ (ఎఫ్ఆర్ఎస్) అమలులోకి తెచ్చారు. ప్రస్తుతం అన్ని చోట్ల ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ అమలులో ఉంది. ఇప్పుడు అన్ని ఆస్పత్రుల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్‌ను కూడా అమలులోకి తెచ్చారు. దీని వల్ల వైద్యులు, సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చేసి ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందుంచాలని ప్రభుత్వ సంకల్పించింది.

శతశాతం హాజరు లక్ష్యం.

ప్రస్తుత నెల నుంచి శతశాతం బయోమెట్రిక్ హాజరు ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు.ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి, బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ కచ్చితంగా అమలు చేయాలని ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలు అందాయి. ఇందులో భాగంగా అటెండెన్స్‌కు జీతాలను అనుసంధానం చేశారు. ఇకపై వైద్యారోగ్య శాఖ లో అందరికీ ఎస్ఆర్ఎస్ హాజరు ప్రకారం జీతాలు చెల్లిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆలస్యం అయినా, ఎస్ఆర్ఎస్ వేయకపోయినా తొలుత లీవుగా పరిగణిస్తారు. ఆ తర్వాత అన్ని సెలవులూ పూర్తయితే నెలవారీ జీతంలో కోత విధించడానికి వెనుకాడవద్దని, వాటిని ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, సంబంధిత హెచ్ఓడీలు పర్యవేక్షించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హాజరును డిస్ట్రిక్ట్ మాన్యువల్ (డీఎంఓ) కమిటీ కూడా పర్యవేక్షిస్తుంది. ఎవరైనా గైర్హాజరైనా, ఆలస్యమైనా సంబంధిత ఉద్యోగులకు సమాచారం వెళ్లేలా అలర్ట్ మెకానిజం కూడా సిద్ధం చేశారు.



పాలకొండ ఏరియా ఆస్పత్రిలో ఎఫ్ఆర్ఎస్ విధానంలో హాజరు వేస్తున్న సిబ్బంది

ఇవీ మార్గదర్శకాలు..

రోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 వరకు వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది తప్పనిసరిగా విధి నిర్వహణలో భాగంగా ఆస్పత్రుల్లో ఉండాలి. ఉదయం కార్యాలయానికి వచ్చిన వెంటనే అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయాలి. అ తర్వాత ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ (ఏఈబీఏఎస్)లో అయితే రోజుకు మూడు సార్లు బయోమెట్రిక్ వేయాలి. ఉదయం 9 గంటలకు ఒకసారి డ్యూటీ పూర్తయిన తర్వాత, సాయంత్రం 4 గంటలకు మరోసారి బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. అదే ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ (ఎస్ఆర్ఎస్)లో ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం నాలుగు గంటలకు హాజరు వేయాలి. ఈ పద్ధతిలో ఉద్యోగుల సెల్‌ఫోన్ సొంతంగా హాజరు నమోదు చేసుకునేలా యాప్ సిద్ధం చేశారు. దీనివల్ల సిబ్బంది ఎక్కడ ఉన్నారో లొకేషన్ కూడా నమోదవుతుంది. తద్వారా ఎక్కడి నుంచి హాజరు వేస్తున్నారో సులువుగా తెలుస్తుంది.

పక్కాగా అమలు చేస్తాం



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వైద్యులు, ఇతర సిబ్బంది హాజరుపై నిఘా పెంచుతాం. విధులకు హాజరైన వారు తప్పనిసరిగా ఎస్ఆర్ఎస్ ద్వారా హాజరు వేసుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఆస్పత్రిలో హాజరు ప్రక్రియను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. ఈ మేరకు అందరికీ సర్క్యులర్ ద్వారా తెలియజేశాం. సిబ్బందిలో జవాబుదారీ తనం మరింత పెంచేందుకు ఈ విధానాన్ని ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులోకి తీసుకువచ్చింది. – జి.నాగభూషణరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, పాలకొండ

మూడుసార్లు హాజరు తప్పనిసరి



ఎస్ఆర్ఎస్ ద్వారా అందరూ తప్పనిసరిగా అటెండెన్స్ వేసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇలా హాజరు వేసుకుంటేనే జీతం వస్తుంది. ఈ క్రమంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్దేశిత ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ ఉండాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడుసార్లు ఎస్ఆర్ఎస్ ద్వారా హాజరు వేసుకోవడం తప్పనిసరి. జిల్లాలో ప్రభుత్వ రంగానికి చెందిన 42 ఆస్పత్రుల పరిధిలో 80 మంది వైద్యులు, వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది దాదాపు 947 మంది ఉన్నారు. వారంతా కచ్చితంగా ప్రభుత్వ ఆదేశాలు పాటించాల్సిందే.

– బగాది జగన్నాథరావు, డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం జిల్లా

దివ్యాంగులు స్వయం సంపాదకులు కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి



దివ్యాంగులకు అందజేసిన బడ్డీలు, కృత్రిమ అవయవాలు

- ఎస్ఐడీబీఐ డీజీఎం సౌరభ్‌బాజపాయ్
- 30 మందికి రూ.25 లక్షలతో బడ్డీలు, ట్రైసైకిల్స్ పంపిణీ

కొత్తవలస: దివ్యాంగులు స్వయం సంపాదకులు కావాలని, ఆర్థికంగా ఎదుగేందుకు భారతీయ చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (ఎస్ఐడీబీఐ) కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ డీజీఎం సౌరభ్‌బాజపాయ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల శ్రీగురుదేవా చాకిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.25 లక్షలతో 30 మంది దివ్యాంగులకు బడ్డీలు(పాన్ షాపులు), వీల్ చైర్స్, ట్రై సైకిల్స్ తదితర సామగ్రిని స్వావలంబన పథకంలో భాగంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగిన రోజు మరొకరిపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు.అందుకు తగ్గ పూర్తి సహకారం తాము అందిస్తామని చెప్పారు. సాయం పొందిన వారు మరొకరికి సాయం చేసే స్థాయికి ఎదగాలని సూచించారు.

గురుదేవా దివ్యాంగులకు వరం

ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి మాట్లాడుతూ గురుదేవా చారిటబుల్ ట్రస్టు దివ్యాంగుల పాలిట వరం అని ప్రశంసించారు. ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు ఆయన జీవితాన్ని దివ్యాంగుల సేవలకే అంకితం చేశారని కొనియాడారు. ట్రస్టు సేవలు గడిచిన 23 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ,కర్నాటక రాష్ట్రాల్లో అందజేస్తూ సుమారు లక్ష మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించడం గొప్పవిషయమని అభినందించారు. పరిశ్రమలకు వచ్చే లాభాల్లో రెండు శాతం నిధులు సీఎస్ఆర్ రూపంలో ఖర్చు చేయాల్సి ఉందని రిలయన్స్ పరిశ్రమ ఏడాదికి సుమారు రూ.1200 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అలాంటి వారు ట్రస్టుకు సహకరించాలని కోరారు.

స్టీల్ ఎక్స్ఛేంజ్ ఆవరణలో పవర్ ప్లాంట్

కార్యక్రమానికి హాజరైన స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారం సీఎండీ బండి సురేష్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో ఎల్.కోట మండలం శ్రీరాంపురం గ్రామం సమీపంలో గల స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారం ఆవరణలో ఒక మిలియన్ టన్ను పవర్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తద్వారా సుమారు 10వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. దివ్యాంగులు, నిరాదరణకు గురైనవారు, పేదలకు గురుదేవా చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. ట్రస్టుకు తమ కర్మాగారం నుంచి పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. ట్రస్టుకు వచ్చి వెళ్లేందుకు దివ్యాంగులను తరలించేందుకు అవసరమైన ఈ వాహనాలను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐడీబీఐ అసోసియేట్ మేనేజర్ శ్రీష్ఠిఠాకూర్, హైవీ వాటర్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.సత్యకుమార్, ఎస్ఐడీబీఐ మాజీ సీఎండీ వీఎస్‌వీ రావ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే...

లంపీస్కిన్‌కు చెక్

లంపీస్కిన్.. పాడి రైతులకు భయపెడుతున్న ఓ వ్యాధి. ఈ వ్యాధి సోకిన పశువుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా మృత్యువాత పడుతున్నాయి. రెండేళ్ల కిందట వెలుగులోకి వచ్చిన ఈ వ్యాధి నుంచి పశువులను కాపాడేందుకు ప్రభుత్వం టీకాలను అందుబాటులోకి తెచ్చింది. ముందస్తుగానే ఈ టీకాలను వేయడం ద్వారా పూర్తి స్థాయి కట్టడి చర్యలు చేపట్టి పాడి రైతులకు అండగా నిలిచింది. దీంతో ఈ వ్యాధి నివారణ చాలా వరకు సులువైంది. అయితే ముందుగానే వీటిని వేయడం మంచిదని పశు వైద్యులు సూచిస్తున్నారు.



ఆవుకు సోకిన మచ్చలను చూపుతున్న రైతు

- వ్యాధి సోకక ముందే టీకాలు మేలు
- జిల్లాలో టీకాల లక్ష్యం 3.02 లక్షలు

రాజాం సిటీ:

పశువుల్లో వచ్చే వ్యాధుల్లో అధిక శాతం నివారించదగ్గవే. వ్యాధి రాకముందు టీకాలతోను, వ్యాధి వచ్చిన తరువాత వైద్యుల సలహాలతో పాటు సూచించిన మందులతో పాడి రైతులు నయం చేసుకుంటున్నారు. అయితే రెండేళ్ల క్రితం మూగజీవాలకు సోకిన లంపీస్కిన్ వ్యాధి తీవ్రతరంగా మారింది. దీంతో పాడి పశువులు బక్కచిక్కిపోవడంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువులు కూడా మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. వీటిలో అధికంగా తెల్లజాతి పశువుల్లో ఈ వ్యాధి వ్యాప్తి అధికంగా కనిపిస్తుంది. వ్యాధి తీవ్రతరం కాకుండా గోట్‌ఫాక్స్ వ్యాక్సినేషన్ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చి టీకాల వేసే కార్యక్రమం ముమ్మరం చేసింది. జిల్లా వ్యాప్తంగా 13 ప్రాంతీయ ఆస్పత్రులు, 65 పశు వైద్యశాల లు, 40 గ్రామీణ పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో జిల్లాలో 3 లక్షల 77 వేల ఆవులు ఉన్నా యి. జిల్లాలో 3,02,450 టీకాలు లక్ష్యం కాగా ఇప్ప టివరకు సుమారు 1.35లక్షల వరకు టీకాల కార్యక్ర మం చేపట్టారు.

ఈ సీజన్‌లోనే అధికం

మున్సిపాల్టీ పరిధి కొత్తవలస గ్రామంలో బి.హరనాథరావుకు చెందిన మూడు ఆవులు ఈ నెల 2న ఒకే రోజు లంపీస్కిన్ వ్యాధి బారిన పడి మృతి చెందాయి. పశువులకు లంపీస్కిన్ (ముద్దచర్మం) వ్యాధి సోకక ముందు గ్రామంలో పశువైద్యాధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని లబోదిబోమంటున్నాడు. ఇలా ఎక్కడో ఒక చోట పశువులకు వ్యాధులు సోకడంతో మృత్యువాత పడుతున్నాయి. అధికారులు స్పందించి వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని కోరుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న చోట దోమలు, ఈగలు అధికంగా ఉంటాయి. దీంతో లంపీస్కిన్ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఏడాది పొడువునా ఈ వ్యాధి లక్షణాలు ఉన్నప్పటికీ వర్షాకాలంలోనే అధికంగా కనిపిస్తుంది. దీంతో ఓ వైపు మేత కొరత, మరోవైపు వ్యాధితో బాధపడుతున్న పశువుల నుంచి పాల దిగుబడి కూడా తగ్గుముఖం పడుతుంది. వ్యాధి సోకిన పశువులను మొదట్లోనే గుర్తించి ఇతర పశువులకు సోకకుండా జాగ్రత్త పడాలి. పశువైద్యులను సంప్రదించి ముందస్తుగా టీకాలు వేయించుకుంటే ప్రమాదం తప్పేందుకు అవకాశం ఉంటుంది.

ఇలా చేస్తే ఉపశమనం

పాడి పశువులకు లంపీస్కిన్ వ్యాధి సోకిన సమయంలో సాంప్రదాయ పద్ధతులు పాటిస్తే కొంత మేర వ్యాధిని అరికట్టవచ్చు. పది తమలపాకులు, పది గ్రాముల మిరియాలు, పది గ్రాములు ఉప్పుతో లేపనం తయారుచేయాలి. దీనికి తగినంత బెల్లం కలపి పశువులకు తినిపించాలి. మొదటి రోజు ఇలా తయారు చేసిన మందును రోజుకు మూడు సార్లు, రెండో రోజు నుంచి రెండు వారాల పాటు రోజుకు రెండు సార్లు తినిపించాలి. రెండు వెల్లుల్లి పాయలు, ధనియాలు పది గ్రాములు, జీలకర్ర పది గ్రాములు, గుప్పెడు తులసి ఆకులు, పది గ్రాముల బిరియాని ఆకులు, పది గ్రాములు మిరియాలు, ఐదు తమలపాకులు, పది గ్రాములు పసుపు, గుప్పెడు వేప ఆకులు, నేరేడు ఆకులు, వంద గ్రాముల బెల్లం తీసుకుని మందును తయారుచేసుకోవచ్చు. దీనిని పశువు ఆరోగ్యం మెరుగుపడే వరకు మొదటి రోజు నాలుగుసార్లు, రెండో రోజు నుంచి రెండు సార్లు చొప్పున తినిపించాలి. లంపీస్కిన్‌తో పశువు చర్మంపై గాయమైతే సాంప్రదాయ పద్ధతిలో మందు తయారుచేసి రాయాలి. వెల్లుల్లి పది రెక్కలు, కుప్పింటాకులు, వేపాకులు గుప్పెడు, 500 మిల్లీ గ్రాముల కొబ్బరి నూనె, గోరింటాకు, తులసి ఆకులు గుప్పెడు చొప్పున తీసుకుని బాగా మిక్సీ చేసుకుని గాయంపై పూయాలి. గాయంపై పురుగులు ఉంటే సీతాఫలం ఆకు రసం రాయడం ద్వారా త్వరగా నయం అవుతుంది.

అందుబాటులో వ్యాక్సిన్

పశువులకు లంపీస్కిన్ వ్యాక్సిన్ సోకకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. జిల్లాలోని అన్ని పశువులకు సంబంధించి వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఇప్పటికే అన్ని పశువైద్య కేంద్రాల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 3,02,450 వ్యాక్సినేషన్ లక్ష్యం కాగా ఇప్పటివరకు సుమారు 1.35 లక్షల వరకు పూర్తి చేశాం. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు చేపడుతున్నాం. పాడి రైతులు వ్యాధి లక్షణాలు గుర్తిస్తే ముందస్తుగా దగ్గర్లోని పశువైద్యాధికారులకు సమాచారం అందించి సూచనలు, సలహాలు పాటించాలి.

– వై.విశ్వేశ్వరరావు, జేడీ, పశుసంవర్ధకశాఖ విజయనగరం